

1,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు సోమవారం 1,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 1,540 క్యూసెక్కులు వదులుతున్నారు. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. పురాతన మండపంలో వెయ్యి దీపాలను వెలిగించారు.



రేపు ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. వివరాలకు 9441509619 నంబర్‌ను సంప్రదించవచ్చు.

బతుకు బండి రయ్..రయ్!



ఆటో నడుపుతున్న మహిళ

ఈమె పేరు కందోలు బేబి. గోనెగండ్ల మండలం నెరడుప్పల గ్రామానికి చెందిన పొదుపు మహిళ. కుటుంబం పేదరికంతో సతమతం అవుతున్న నేపథ్యంలో ధైర్యంగా ఆటో ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకోసం మహిళ ఉన్నతి పథకం కింద రూ.50 వేలు లోన్ తీసుకున్నారు. బ్యాంకుల నుంచి లింకేజీ రుణం తీసుకున్నారు. సమకూరిన డబ్బుతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆటో ఏర్పాటు చేసుకున్నారు. అనంతపురం జిల్లాలోని ఆర్‌డీటీలో డ్రైవింగ్‌లో శిక్షణ పొంది.. లైసెన్స్ పొందారు. ఆరు నెలలుగా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. రోజుకు అన్ని ఖర్చులు పోగా రూ. 600–800 ప్రకారం మిగులుతోందని ఈమె చెబుతున్నారు. ఆటో నడపడంలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు.



ఆటో నడుపుతున్న ఈమె పేరు రిబికమ్మ. తుగ్గలి మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన మహిళ. గతంలో తీవ్ర పేదరికంతో అనేక ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆర్‌డీటీ ద్వారా ఉచితంగా ఆటో మంజూరు చేశారు. నెల రోజుల పాటు డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన తర్వాత లైసెన్స్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆటోను రోళ్లపాడు నుంచి ప్యాపిలి, జొన్నగిరి గ్రామాల మధ్య ప్రయాణికుల కోసం నడుపుతున్నారు. నెలకు అన్ని ఖర్చులు పోగా.. రూ.12,000 వరకు నికరాదాయం వస్తోంది. ఆటో నడపడంలో ఎలాంటి ఇబ్బంది లేదని ఈమె చెబుతున్నారు.



- ఆటో నడుపుతున్న మహిళలు
- 'ఉన్నతి' కింద రుణం మంజూరు చేస్తున్న ప్రభుత్వం
- వడ్డీ లేకుండా 48 కంతుల్లో చెల్లించే అవకాశం
- ఈ నెల 7న 11 మంది మహిళలకు ఆటోల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): అవకాశాలను అందిపుచ్చుకోవడంలో అతివలు ముందుంటున్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కాలంతోపాటు పోటీ పడుతూ రయ్..రయ్ అని బతుకు బండిలో దూసుకుపోతున్నారు. మగవారికి సైతం కష్టంగా అనిపించే ఆటో డ్రైవర్ వృత్తిని ఎంచుకుని ఆత్మస్థైర్యంతో సాగుతున్నారు. మహిళల ఆసక్తిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలను మరింత మెరుగు పరిచేందుకు వడ్డీ లేకుండా రుణ సదుపాయం కల్పిస్తోంది. ఇందుకోసం డీఆర్‌డీఏ–వైకేపీ ద్వారా ఉన్నతి పథకాన్ని అమలు చేస్తోంది.

మొదటి విడతలో 11 మందికి ఆటోలు...

డీఆర్‌డీఏ–వైకేపీ అమలు చేసే పథకాల్లో 'ఉన్నతి' కీలకమైనది. ఎస్సీ, ఎస్టీ మహిళల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ పథకం కింద వడ్డీలేని రుణాలు ఇస్తున్నారు. తీసుకున్న రుణాలు వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంది. ఈ పథకం కింద ఉన్నతి.. మహిళా శక్తి.. ఆటో రిక్షా పేరుతో ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మొదటి విడతలో 11 మంది మహిళలకు పూర్తి ధరలో 90 శాతం మొత్తాన్ని రుణంగా మంజూరు చేశారు. డ్రైవింగ్ వచ్చి లైసెన్స్ కలిగి ఆటో నడపడంపై ఆసక్తి ఉన్న మహిళలకు అవకాశం ఇచ్చారు. తొమ్మిది బజాజ్ కంపెనీ, రెండు ఆప్పీ కంపెనీకి చెందిన ఆటోలు పంపిణీ చేస్తున్నారు. కల్లూరు మండలంలో ఐదుగురు, కర్నూలు మండలంలో ఇద్దరు, ఆలూరు, కోడుమూరు, సి.బెళగల్, గోనెగండ్ల మండలాల్లో ఒక్కొక్కరికి ప్రకారం ఆటోలు మంజూరు చేశారు. ఆటోల పూర్తి ధర రూ.32,58,078 ఉండగా. మహిళలు 10 శాతం మొత్తం అంటే రూ.3,48,018 భరించారు. సెర్ప్‌లో ప్రత్యేక విభాగమైన ఉన్నతి కింద రూ.29,10,060 రుణ సదుపాయం కల్పించారు. రుణంగా పొందుతున్న మొత్తాన్ని మహిళలు 48 వాయిదాల్లో వడ్డీలేకుండా చెల్లించాల్సి ఉంటుంది.

ఎస్సీ, ఎస్టీ మహిళలకు వరం

షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన మహిళలు తమకు ఆసక్తి ఉన్న వృత్తుల్లో రాణించేందుకు ఉన్నతి పథకం చక్కగా తోడ్పడుతోంది. ఈ పథకం కింద రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తున్నారు. 2022–23లో దాదాపు 3,000 మంది మహిళలకు రూ.16 కోట్లు రుణాలుగా పంపిణీ చేశారు. 2023–24లో 2,275 మంది మహిళలకు రూ.12 కోట్లు వడ్డీలేని రుణాలుగా పంపిణీ చేయాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు 1,104 మందికి రూ.5.56 కోట్లు పంపిణీ చేశారు. నూతనంగా ఉన్నతి.. మహిళ శక్తి... ఆటోరిక్షా కార్యక్రమం కింద స్వయం సహాయక సంఘాల్లో ఉన్న 11 మంది మహిళలకు ఆటోలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఉపాధి 'మార్గం'

జిల్లాలో ఇప్పటికే ముగ్గురు మహిళలు ఆటోలు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నారు. డ్రైవింగ్ అంటే భయం లేదని నిరూపిస్తున్నారు. గోనెగండ్ల మండలం నెరడుప్పల గ్రామానికి చెందిన బేబి, పెద్ద కడుబూరు మండలం కంబలదిన్నె గ్రామానికి చెందిన బోడెమ్మ, తుగ్గలి మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన రిబికమ్మలు ఆటోలు నడుపుతూ... కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. డ్రైవింగ్‌లో ఎలాంటి భయం, ఆందోళన లేకుండా పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. ఇందులో నెరడుప్పల గ్రామానికి చెందిన బేబీకి ఇది వరకే ఆటో మెయిన్‌టెనెన్స్, రిపేరీల కోసం ఉన్నతి కింద రూ.50 వేలు రుణ సదుపాయం కల్పించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేయడంతో బేబీకి 90 శాతం రుణంపై కొత్త ఆటో మంజూరు చేశారు. మిగిలిన ఇద్దరు మహిళలు అనంతపురం జిల్లాకు చెందిన ఆర్‌డీటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆటోలు పొంది ఉపాధి అవకాశాలను అభివృద్ధి చేసుకున్నారు.

సరికొత్త కార్యక్రమం



ఉన్నతి.. మహిళా శక్తి.. ఆటో రిక్షా పేరుతో ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం కింద ఆటో ధరలో 90 శాతం మొత్తాన్ని రుణంగా ఇస్తున్నాం. మహిళలు 10 శాతం వాటా భరించాల్సి ఉంది. ఉన్నతి కింద స్వయం సహాయక సంఘాల్లో ఎస్సీ, ఎస్టీ మహిళలకు గరిష్టంగా రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నాం. కొత్తగా 11 మంది దళిత మహిళలకు ఈ నెల 7న ఆటోలు పంపిణీ చేయనున్నాం.

–సలీమ్‌బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ–వైకేపీ, కర్నూలు

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు (అర్బన్): అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని బీఎల్‌ఓలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు ఉందో లేదో పరిశీలించాలన్నారు. లేకపోతే వారితో ఫార్మ్ 8 తీసుకోవాలని సూచించారు. ఏఈఆర్వోలు, ఈఆర్వోలు అన్ని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లు 2 కిలోమీటర్లకు పైగా ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కర్నూలు అర్బన్, హాలహర్వి, కోడుమూరు, పెద్దకడుబూరు, కోసిగి మండలాల్లో రిజిస్ట్రేషన్లు చాలా వెనుకబడి ఉన్నాయన్నారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్ల ద్వారా క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు కల్పించాలన్నారు. వెల్దుర్తి మండల సర్వేయర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకాకపోవడంతో చర్యలు తీసుకోవాలని ఏడీ సర్వేయర్‌ని ఆదేశించారు. హౌసింగ్‌కి సంబంధించి మండల వారీగాలక్ష్యాలను కేటాయించామని, ప్రగతిపై నివేదిక రూపొందించాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. రీసర్వేలో భాగంగా 24 వేల స్టోన్ ప్లాంటేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాల పంపిణీ బుధవారం నాటికి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భయపెడుతున్న మిచాంగ్ తుపాను

- నంద్యాల జిల్లాకు ఆరెంజ్, కర్నూలు జిల్లాకు ఎల్లో అలర్ట్



హొళగుందలో ధాన్యం తడవకుండా తార్పిళ్లను కప్పిన దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావం ఉమ్మడి కర్నూలు జిల్లాపైనా చూపనుంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కర్నూలు జిల్లాకు ఎల్లో, నంద్యాల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. కర్నూలు కంటే నంద్యాల జిల్లాపైనే తుపాను ప్రభావం ఎక్కువగా ఉండనున్నట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే ఆకాశం మేఘావృతమై చలి వాతావరణం నెలకొంది. శనగ పంట 55 రోజుల దశలో ఉండటంతో ఈ సమయంలో ఒక పదును అయితే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తుపాను ప్రభావం నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ సృజన వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. వరి కోతలు, మిరప తెంపడం వంటి వాటిని తుపాను ప్రభావం తొలగిపోయే వరకు వాయిదా వేసుకోవడం మంచిదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్లను ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో తడవకుండా జాగ్రత్త చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

కాచిగూడ–చెంగల్‌పట్టు రైలు రద్దు

కర్నూలు(రాజ్‌విహార్): తుపాను కారణంగా కాచిగూడ నుంచి కర్నూలు మీదుగా చెంగల్‌పట్టు (తమిళనాడు)కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును సోమవారం (4వ తేదీ) రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు వైపులా తిరిగే 17651, 17652 రైళ్లను రద్దు చేశామని, ప్రయాణికులు గమనించి, సహకరించాలని కోరారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

తుపాను ప్రభావం చూపే అవకాశం ఉన్నందున విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. సోమవారం ఆయన కింది స్థాయి సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని, సమస్య ఏర్పడినట్లు ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వర్షం, గాలి సమయంలో పనులు చేసే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎల్‌సీ తీసుకుని, ఫ్యూజ్ తొలగించి, సరఫరా లేదని ధ్రువీకరించున్న తరువాతే పని ప్రారంభించాలన్నారు. ఎర్త్ రాడ్ వేసుకోవడంతో పాటు తలకు హెల్మెట్ ధరించాలని సూచించారు.

'సాయుధ' నిధికి విరాళాలివ్వండి



సాయుధ దళాల స్టిక్కర్స్, కార్‌గ్లాగ్స్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

- జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అర్బన్): సాయుధ దళాల ప్రత్యేక నిధికి ప్రతి ఒక్కరూ విరాళాలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో త్రివిధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సాయుధ దళాల పతాక స్టిక్కర్స్, కార్ గ్లాగ్స్‌ను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశ భద్రతలో త్రివిధ దళాల సేవలు కీలకమన్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో దేశ వ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. యుద్ధంలో మృతి చెందిన, పదవీ విరమణ చేసిన జవానుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ, నాగప్రసన్న లక్ష్మి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి రత్నరూత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీజీవీ శంకరరావు అన్నారు. సోమవారం ఉదయం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఎస్టీ కమీషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు వి.సోమశంకర నాయక్, కొర్రా రామలక్ష్మి, జరపరంగి సురేష్, మురళీదొర, ఎం. విశ్వేశ్వరరాజులు దర్శించుకున్నారు. అనంతరం ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఆ తర్వాత మేకలబండ చెంచుగిరిజన గూడెంలోని గిరిజనులతో వారు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంకమ్మ చెంచుగూడానికి చెందిన బీటెక్ విద్యార్థిని కురుముల అంజమ్మకు ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్రం.. కార్తీక శోభితం

శ్రీశైలంటెంపుల్: పరమేశ్వరుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసం కావడంతో ముక్కంటి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం మూడవ సోమవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి బారులుదీరారు. ఉచిత దర్శన క్యూలైన్లు గంగాధర మండపం వరకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజామున ఆలయ ద్వారాలను తెరిచి భక్తులను స్వామిఅమ్మవార్ల దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామిఅమ్మవార్ల అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం కల్పించారు. ఉచిత దర్శనానికి 6 గంటల సమయం, శీఘ్ర దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర (శివ)మాఢ వీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కాగా కార్తీకమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద జరగాల్సిన లక్షదీపోత్సవం, దశవిధ హారతులు తుఫాను కారణంగా దేవస్థానం అధికారులు రద్దు చేశారు.



కార్తీకదీపాలను వెలిగిస్తున్న భక్తులు



సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



ఒకప్పుడు తిండికి, గుడ్డకు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డాం. చేతిలో చిల్లి గవ్వ ఉండేది కాదు. అప్పులు పుట్టేవికావు. కూలి పనికి వెళ్లినా వారానికి డబ్బులు ఇచ్చేవారు. మాటల్లో చెప్పలేని బాధలను అనుభవించాం. మా ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇరుపొరుగువారు కూడా మావైపు చూసేవాళ్లు కాదు. ఉన్న కొద్దిపాటి భూమిలో పంటలు పండక నానా తంటాలు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా బతుకుల్లో మార్పు వచ్చింది. నేను పొదుపు గ్రూపులో ఉండటంతో రోటీ మేకింగ్ కేంద్రాన్ని మంజూరు చేశారు. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో రూ.4 లక్షల పెట్టుబడితో హాలహర్వి మండలం గూళ్యంలో ఈ కేంద్రాన్ని గతేడాది ప్రాంభించా. జొన్న రొట్టెలను తయారు చేసి, ప్యాకింగ్ ద్వారా ఎగుమతి చేస్తున్నాం. ఖర్చులు పోను నికరాదాయం మిగులుతోంది. నాతోపాటు మరో ఇద్దరికి ఈ కేంద్రంలో పని కల్పిస్తున్నా. మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడిఉంటాం.

– దేవిరెడ్డి విజయలక్ష్మి

మా బడి చాలా బాగుంది



నేను 20 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉండేవి కాదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. మద్దికెర మండలం పెరవలి ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో గతంలో మంచినీరు దొరికేవి కాదు. చుట్టుపక్కల వారి దగ్గరి కెళ్లి అడిగి తెచ్చుకుని దాహం తీర్చుకోవాల్సి వచ్చేది. మధ్యాహ్న భోజన సమయంలో మరింత కష్టంగా ఉండేది. విద్యార్థులు పుస్తకాల సంచితో పాటు వాటర్ బాటిల్ కూడా బరువుగా మోసేవారు. ప్రస్తుతం ఈ కష్టాలు తొలగాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.60 లక్షలతో పాఠశాలలో శుద్ధజల ప్లాంటును ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఫిల్టర్ వాటర్ అందిస్తున్నాం. అంతేగాక తరగతి గదులను అందంగా తీర్చిదిద్ది, బెంచీలు ఏర్పాటు చేశారు. మా బడి చాలా బాగుపడింది.

– లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు

న్యూస్‌రీల్

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్ర–2024కు దరఖాస్తులను ఆహ్వానిస్తూ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ జారీ చేసినట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మక్కాలో హజ్, మదీనా యాత్రకు వెళ్లేందుకు ఆసక్తి ఉన్న ముస్లింలు డిసెంబర్ 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు పాస్ పోర్టు జిరాక్స్ కాపీ, ఆధార్, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు–2, బ్యాంక్ అకౌంట్, కోవిడ్–19 సర్టిఫికెట్ కాపీలు జతచేయాలన్నారు. వివరాలకు 94402 32564 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీకి నేడు ఆఖరు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో డిసెంబర్ నెల వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పంపిణీ మంగళవారం కూడా కొనసాగనుంది. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్లు పైబడిన వారు వేలిముద్రలు, ఐరిష్ నమోదు కాని పింఛనుదారులు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందవచ్చు. ఇతర కేటగిరీలకు చెందిన పింఛనుదారులు విధిగా 3 సార్లు వేలిముద్రలు, ఐరిష్ నమోదుకు విధిగా ప్రయత్నం చేయాల్సి ఉంది. మూడుసార్లు కూడా ఫెయిల్ అయితే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,45,320 పింఛన్లు ఉండగా 2,40,320 మందికి.. నంద్యాల జిల్లాలో 2,21,508 పింఛన్లు ఉండగా 2,17,724 పింఛన్ల పంపిణీ పూర్తయింది.

మహానందీశ్వరుడి సేవలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి



మహానందిలోని గరుడనంది వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీనివాసరావు

మహానంది: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సోమవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్తీకమాసం, మూడవ సోమవారం సందర్భంగా నవనంది క్షేత్రాల సందర్శనలో భాగంగా మహానంది వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి, శ్రీ వినాయక నందీశ్వర స్వామి, గరుడనందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ నివేదిక సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): కరువు మండలాల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు అవసరమైన నివేదికను జిల్లా వ్యవసాయ యంత్రాంగం సిద్ధం చేసింది. జిల్లాలో 26 మండలాలు ఉండగా తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలు మినహా మిగిలిన 24 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కరువు మండలాల్లో ప్రతి రైతుకు 2 హెక్టార్ల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించనుంది. కరువు రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం ఎస్‌డీఆర్‌ఎఫ్ మార్గదర్శకాలను సవరించింది. వ్యవసాయ పంటలకు సంబంధించి 2,90,741 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ లభించనుంది. ఈ రైతులకు సంబంధించి 2,38,231.42 హెక్టార్లకు రూ.368,36,27,080 ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేలా వ్యవసాయ యంత్రాంగం నివేదిక సిద్ధం చేసింది. నివేదికను కలెక్టర్ సృజన ద్వారా ప్రభుత్వానికి పంపుతున్నట్లుగా జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ నివేదిక తయారీ మంగళవారం ఉదయానికి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

డ్వామా విజిలెన్స్ అధికారిగా భాస్కర్



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటి యాజమాన్య సంస్థ విజిలెన్స్ ఆఫీసర్‌గా జి.భాస్కర్ నియమితులయ్యారు. నంద్యాల పట్టణానికి చెందిన ఈయన గోస్పాడు ఎంపీడీవోగా పనిచేస్తూ ఇటీవల డీఎల్‌డీవోగా పదోన్నతి పొందారు. పదోన్నతిపై ప్రభుత్వం డ్వామా విజిలెన్స్ అధికారిగా నియమించింది. ఈ మేరకు సోమవారం ముందుగా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

పోస్టాఫీసులో దొంగలు పడ్డారు

● రూ. 2.88 లక్షల నగదు అపహరణ

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌కే పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న పోస్టాఫీసులో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. గుర్తు తెలియని దుండగులు పోస్టాఫీస్ తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ట్రెజరీ రూంలోని మనీ చెస్ట్‌లో భద్రపరిచిన రూ. 2.88 లక్షల నగదును అపహరించారు. సోమవారం ఉదయం సిబ్బంది విధులకు రాగా తాళం పగలగొట్టి ఉండటంతో లోనికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. సబ్ పోస్ట్‌మాస్టర్ గురువయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చాగలమర్రిలో చైన్‌స్నాచింగ్

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని పాత ఎస్సీ కాలనీ సమీపంలో సోమవారం తెల్లవారుజామున చైన్‌స్నాచింగ్ జరిగింది. స్థానిక శ్రీనివాస నగర్ కాలనీలో నివాసం ఉంటున్న పి.లక్ష్మీదేవి భర్త రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటసుబ్బయ్యతో కలిసి కార్తీకమాస పూజలకు శివాలయానికి బయలుదేరారు. చక్రపాణి థియేటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లక్ష్మీదేవి మెడలో ఉన్న రూ.1.20 లక్షల విలువైన రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని చుట్టుపక్కల గాలించినా చైన్‌స్నాచర్ ఆచూకీ లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

కోవెలకుంట్ల: ప్రేమ పేరుతో ఓ యువతిని మోసం చేసి మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించిన యువకుడిపై సోమవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. అవుకు మండలం సంగపట్నం గ్రామానికి చెందిన వలి కోవెలకుంట్ల పట్టణంలో ఓ షాపులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఇదే షాపులో పనిచేస్తున్న పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఎస్టీ కులానికి చెందిన స్పందనతో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే వలి ప్రేమించిన యువతితో కాకుండా మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు యత్నించగా ఆ వివాహాన్ని అడ్డుకుని బాధిత యువతి పోలీసులను ఆశ్రయించింది. విచారణ జరిపిన పోలీసులు వలిపై చీటింగ్, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఐదు మెడికల్ షాపులు సీజ్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు జరుపుతున్న ఐదు మెడికల్ షాపులను సోమవారం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ గత నెల 15న పట్టణంలోని పలు మెడికల్ షాపులపై దాడులు నిర్వహించామన్నారు. శ్రీనివాస సెంటర్‌లోని అపోలో మెడికల్ షాపు, ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న అపోలో మెడికల్ షాపు, గాంధీ చౌక్ లోని ఆంధ్ర మెడికల్స్,బిస్మిల్లా మెడికల్స్, కాత్యాయని షాపుల్లో ఔషధ నియంత్రణ అధికారుల సమక్షంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 5 మెడికల్ షాపులకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకుని పరిశీలించామన్నారు. మందుల విక్రయాల్లో ప్రభుత్వ నిభంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపినట్లు తేలడంతో ఆ ఐదు మెడికల్ షాపులను సీజ్ చేశామన్నారు. సీఐ సునీల్ కుమార్‌తో పాటు, సీఐ కేశవరెడ్డి, ఔషద నియంత్రణాధికారి ఖలందర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల హెచ్ఆర్ఏ పెంచాలి

కర్నూలు(రాజ్‌విహార్): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్ఆర్ఏ పెంచాలని కోరినట్లు కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తను పార్లమెంట్‌లో రైల్వే, బీఎస్ఎన్ఎల్, టెలి కమ్యూనికేషన్స్, సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ కింద పనిచేస్తున్న ఉద్యోగుల హెచ్ఆర్ఏ పెంచాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. అలాగే న్యాయవాదుల బిల్లు(సవరణ)–2023పై మాట్లాడి పూర్తి మద్దతు ప్రకటించినట్లు చెప్పారు.


ఆళ్లగడ్డ: కాచింతల క్షేత్రంలో దీపారాధన


కర్నూలు: కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు


కర్నూలు: దేవనగర్ శివాలయంలో..


నంద్యాల: ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


గడివేముల: భోగేశ్వర స్వామికి క్షీరాభిషేకం


హొళగుంద: సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం


కర్నూలు: భక్తిశ్రద్ధలతో దీపారాధన చేస్తున్న మహిళ


శ్రీశైలం టెంపుల్: కార్తీకదీపాన్ని వెలిగిస్తున్న భక్తులు


డోన్: రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

'ప్రణవ' పావనం

కార్తీక మాసం మూడో సోమవారం.. శైవక్షేత్రాలు ప్రణవ నాదంతో ప్రతిధ్వనించాయి. పంచాక్షరి మంత్రంతో మార్మోగాయి. లింగాకారుడు.. సర్వ శుభంకరుడు అయిన పరమేశ్వరున్ని వేడుకోవడానికి భక్తులు వేలాదిగా శైవాలయాలకు తరలివచ్చారు. ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దీపకాంతులతో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రముఖ ఆలయాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. కార్తీక ఉత్సవాలను పురస్కరించుకుని పలుచోట్ల అంగరంగ వైభవంగా గ్రామోత్సవాలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తుల సౌకర్యార్థం దాతలు అన్నదానం చేశారు. – సాక్షినెట్‌వర్క్


ఆళ్లగడ్డ: అహోబిలంలో స్వామికి అభిషేకం


నంద్యాల: చంద్రశేఖరస్వామికి అభిషేకం


గడివేముల: భోగేశ్వరున్ని దర్శించుకునేందుకు..


శ్రీశైలం టెంపుల్: భక్తులతో కిక్కిరిసిన క్యూ


కర్నూలు: సప్తగిరినగర్ శివాలయంలో పూజలు


దేవనకొండ: శివుని ఆకారంలో దీపాలను వెలిగించిన మహిళలు


బనగానపల్లె రూరల్: యాగంటిలో ప్రధాన ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన


అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అర్బన్): జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేయాలన్నారు. ఈ ప్రక్రియ వల్ల అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగప్రసన్నలక్ష్మి, రమ, అనురాధ, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

స్పందనకు వచ్చిన అర్జీల్లో కొన్ని ....

- తనకు 3.90 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో వేరే వారి పేరిట నమోదు చేశారని, సమస్యను పరిష్కరించాలని కృష్ణగిరి మండలం అమకతాడు గ్రామానికి చెందిన బోయ లింగన్న వినతిపత్రం సమర్పించారు.
- తనకు1.83 ఎకరాల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో ఒక ఎకరా మాత్రమే నమోదైందని, మిగిలిన 83 సెంట్లను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కోడుమూరు మండలం ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన బోయ అశోక్ కోరారు.
- తనకు 1.45 ఎకరాల భూమి ఉందని, రీ సర్వేలో 1.54 ఎకరాలు చూపించారని, ఉన్న భూమినే స్థిరంగా చూపించాలని గూడూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన ఎం రజనీ కుమార్ వినతి పత్రం అందించారు.
- తనకున్న 1.53 ఎకరాల భూమిని తన కుమారులకు దాన విక్రయం చేయించానని, ఆన్‌లైన్‌లో తన కుమారుల పేర్లు నమోదు చేయించాలని దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన టీ చిన్నప్ప కోరారు.

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

బొమ్మలసత్రం: కర్నూలు పట్టణానికి చెందిన విజయ్ అనే వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ.1.50 లక్షలు తీసుకుని ఉద్యోగము ఇప్పించకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని నంద్యాలకు చెందిన ప్రదీప్ అనే వ్యక్తి స్పందనలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాది చేశాడు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. అలాగే స్పందనలో ఒకసారి వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదిదారుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. త్వరితగతిన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తంగా 90 ఫిర్యాదులు అందాయని వాటిని చట్ట పరిదిలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, నంద్యాల తాలూక సీఐ దస్తగిరి బాబు, సీఐ సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఈరన్నస్వామికి బంగారు గాజుల విరాళం



కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామికి సోమవారం కర్నూలు నగరానికి చెందిన చక్రపాణి, అతని కుటుంబ సభ్యులు 39.4 గ్రాముల బంగారు గాజులను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, ట్రస్టుబోర్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కర్నూలు: నగరంలోని ధర్మపేటకు చెందిన గోవిందు (36) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ నెల 2వ తేదీన అదే కాలనీకి చెందిన స్నేహితుడు చనిపోవడంతో సుంకేసుల రోడ్డులోని శ్మశాన వాటికకు అంత్యక్రియలకు వెళ్లాడు. తిరిగి రాలేదు. సోమవారం ఉదయం శ్మశాన వాటిక దగ్గర ఉన్న ముట్టికుప్పల మధ్య శవమై కనిపించాడు. ఈయన గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 నుంచి మిషన్ ఇంద్ర ధనస్సు


రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన నగరంలోని ఇల్లూరు నగర్‌లో ఉన్న యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలు ఏదైనా కారణం వల్ల ఇవ్వనట్లయితే డ్యూ లిస్ట్ తయారు చేసుకుని వారికి మూడవ విడతలో భాగంగా 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో టీకాలు వేయించాలన్నారు. ఆ వివరాలను యువిన్, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. న్యుమోనియా లక్షణాలున్న పిల్లలను పరిశీలించి వారికి మెరుగైన వైద్యం కోసం సమీపంలోని సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించాలని సూచించారు.

కేసీలో వ్యక్తి గల్లంతు

కర్నూలు: నగరంలోని ధర్మపేటకు చెందిన గౌండా పాల్ (46) కేసీ కెనాల్‌లో గల్లంతయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ధర్మపేటకు చెందిన శిరీష కెనాల్ ఒడ్డున బట్టలు ఉతుకుతూ ప్రమాదవశాత్తు జారి కాలువలో పడింది. అక్కడే ఉన్న పాల్‌తో పాటు మరికొందరు కలసి ఆమెను బయటకు తీసి కాపాడారు. అయితే పాల్ నీటిలో మునిగి కనిపించకపోవడంతో అక్కడున్న యువకులు చాలాసేపు గాలించినా కనిపించలేదు. ఈయన గౌండా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. విషయం తెలిసిన వెంటనే రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. బంధువులు కూడా కేసీ కెనాల్ వెంట గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాన పథకానికి విరాళం


దాతలకు జ్ఞాపికను అందజేస్తున్న ఏఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం ఒంగోలుకు చెందిన అపూర్వ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఆర్ సురేష్ రూ.1,00,500, బెంగళూరుకు చెందిన అశ్రిత్, పి.అశోక్ రూ.1,00,500 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని ఏఈఓ ఎం.ఫణిధర ప్రసాద్‌కు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

మహానందీశ్వరుడికి వెండి రుద్రాక్ష మండపం


వెండి రుద్రాక్ష మండపాన్ని తీసుకొస్తున్న దాతలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీమహానందీశ్వర స్వామివారికి నంద్యాలకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ మారం వెంకట సుబ్బయ్య, కటుంబసభ్యులు రూ.25 లక్షలు వెచ్చించి 35 కిలోల వెండితో రుద్రాక్ష మండపం చేయించారు. ఈ మేరకు దాతలు సోమవారం రాత్రి మహానందికి చేరుకుని ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో వెండి మండపాన్ని అందించారు. వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికి ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి అలంకరించారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రసాదాలు అందించి సత్కరించారు.

లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేయాలి

కర్నూలు(లీగల్): వైఎస్ఆర్‌సీపీ లీగల్‌సెల్‌ను మరింత బలోపేతం చేయాలని కర్నూలు, అన్నమయ్య జిల్లాల జోనల్ ఇన్‌చార్జి ఎం.ప్రభాకర్, స్టేట్ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ షాషావలి అన్నారు. ఈనెల 10వ తేదీన కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సమావేశం జరుగనుంది. ఈ కార్యక్రమం నిర్వహణపై సోమవారం స్థానిక జిల్లా లీగల్ సెల్ కార్యాలయంలో అధ్యక్షుడు పి.సువర్ణారెడ్డి అధ్యక్షతన సమావేశమై చర్చించారు. జోనల్ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ జిల్లా లీగల్ సెల్ సభ్యులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టం ద్వారా రైతులకు ఎలాంటి నష్టం ఉండదని సువర్ణారెడ్డి అన్నారు. అనంతరం బండారి ఈరన్న నాయకత్వంలో సుమారు 20 మంది న్యాయవాదులు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌లో చేరారు.


వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌లో చేరిన న్యాయవాదులు